

# చుట్టం

- ప్రఫుల్లచంద్ర

“చుట్ట ఎలా కాలుస్తారో వివరించనక్కరలేదు, సార్! నాకూ తెలుసు. మీ చుట్టల్ని మీరే పీల్చేసి ఆనందించి, అనుభవించి అందుకు మమ్మల్ని పరిహారం అడుగుతున్నారే అదే నాకర్థంకానిది”

కాదేదీ కవితకనర్హం అని శ్రీశ్రీ అంటే కాదేదీ బీమా కనర్హం అని నేనే అంటాడు. నేనే అంటే నేయులూ నేదునూరి ఉరఫ్ నేదునూరి ఆంజనేయులు!

అతగాడు అమెరికాలో బావగారి బీమా కంపెనీలో ఉద్యోగం వెలగబెట్టి, మన దేశం అనుసరిస్తున్న ఉదార ఆర్థిక విధానాలకు ఆకర్షితుడై డబ్బులు మూటకట్టుకోవచ్చున్న ఆశతో బాబీకి (అనగా బావగారి బీమా కంపెనీకి) భారతదేశంలో అధీకృత ఏజంట్‌గా అవతరించాడు.

అమెరికాలో అయితే సెక్సీ నటీమణులు తమ స్తనాల్ని బీమా చేయించుకుంటారు. ఫైట్ మాస్టర్లు తమ శరీరాల్ని బీమా చేయించుకుంటారు. నఖ, శిఖలూ, కన్నూ, పన్నూ అన్నీ బీమాకు అర్హమే. ఇలాంటి బీమాలన్నింటినీ అమెరికాలో బాబీ చేపడుతుంది. ఆ గాలిని మన దేశంవైపు మళ్ళించాలని హైదరాబాద్‌లో దిగాడు నేనే.

ప్రస్తుతానికి రాష్ట్రం, తర్వాత దేశం అన్న లక్ష్యంతో ఆకర్షణీయ భవనంలో అన్ని హంగులతో ఆఫీసు ప్రారంభించి ఏజంట్లను నియమించాడు. వాళ్ళేమో రాష్ట్రం నాలుగు మూలలకూ ప్రాకి పోయారు. పెద్ద తలకాయలతో వ్యవహారం తన భుజస్కందాల మీద వేసుకొని రోడ్డున పడ్డాడు నేనే.

చూడ చక్కని డాబా. కాంపౌండ్‌కి తగిలించిన “జంబుకేశ్వర్, అడ్వకేట్” అన్న బోర్డుచూసి ఆగిపోయాడు నేనే - ఇంటి అందం చూసి కాదు, ఆ పేరు చూసి! మంచి బేరం దొరక వచ్చనిపించింది. చకచకా లోనికెళ్ళాడు.

పెద్ద హాలు. చుట్టూ అద్దాల బీరువాల నిండా పెద్ద పెద్ద బౌండ్ బుక్స్, టేబుల్ మీద చిందర వందరగా ఫైళ్ళు. టేబుల్ మీదకు కాళ్ళు చాపుకొని హాయిగా చుట్ట కాల్చుకుంటూ కుర్చీలో కూర్చున్న జంబుకేశ్వర్. పెద్దగా ప్రాక్టీసు లేని లాయర్ కాబోలు. క్లయింట్‌లు గాని సహాయకులు గాని లేనే లేరు.

“బయట బోర్డు మీద మీ పేరు తమాషాగా కనిపిస్తే ఇలా వచ్చాను సార్.”

ఎదుటి కుర్చీలో కూర్చుంటూ చిరునవ్వు చిందించాడు నేనే.

జంబుకేశ్వర్ కూడా నవ్వేస్తూ కాళ్ళు టేబుల్ నుంచి కిందకు దించి “అమ్మా నాన్నా ఏ ఉద్దేశంతో నాకా పేరు పెట్టారో గాని ఇప్పుడు నేను సార్థక నామధేయుడినే. నక్క జిత్తులన్నీ ఉపయోగించి కేసులు గెలుస్తూ ఉంటాను. పట్టిన ఏ కేసులోనూ నేనింత వరకూ ఓడిపోలేదు తెలుసా!” బెకబెకా నవ్వాడు.

ఆ కోతలు వింటూ లోలోనే నవ్వుకొని, బీమా పురాణం విప్పి శోష వచ్చేవరకూ బీమా ప్రయోజనాలు, లాభాలూ వివరించి-

“అసలు బీమా స్వరూపమే మారిపోయిందండీ. ఒకప్పుడు బీమా అంటే జీవిత బీమా ఒక్కటే. కానీ యిప్పుడో! జీవులు, నిర్జీవులూ అన్న తేడా లేకుండా అన్నింటి మీదా బీమా సౌకర్యం ఉంది. ఉదాహరణకు- మీరిప్పుడు చుట్టల్ని కూడా దొంగల నుంచి అగ్నినుంచి రక్షణకోసం బీమా చేయవచ్చు!” గొప్పగా అన్నాడు నేనే.

జంబుకేశ్వర్ బుర్రలోని నక్క చటుక్కున కూసింది!

నిన్ననే హవానా నుంచి స్నేహితుడు వంద సిగార్‌ల ప్యాకెట్ పంపాడు. ఖరీదు మన డబ్బులో చెప్పాలంటే నాలుగువేల రూపాయలు! వాటిని అగ్నిప్రమాద బీమా లక్ష రూపాయలకు చేయాలనిపించింది. నేనే ఎగిరి గంతేశాడు.

వారంరోజుల్లో నియమ నిబంధనలు పేర్కొంటూ డాక్యుమెంట్ మీద సంతకాలు అయాయి జంబుకేశ్వర్ మొదటి వాయిదా ప్రీమియం కట్టాడు. రెండు నెలలు గడిచాక చుట్టలన్నీ కాలిపోయాయి. కాబట్టి బీమా సొమ్ము లక్ష రూపాయలూ చెల్లించమంటూ బాబీ కంపెనీకి అర్జీ పెట్టాడు.

గుండెలు బాదుకుంటూ వచ్చిన నేనే చుట్టలెలా కాలిపోయాయని అడిగితే-

“ఎలాగేమిటీ! చుట్టలన్నీ ఎలా కాలిపోతాయో అలాగే! ఫారిన్ చుట్ట కదాని వేరే విధంగా కాలిపోదు!” గుప్పున పొగ ఒదులుతూ అన్నాడు జంబుకేశ్వర్. నేనేకి అర్థం కాలేదు.

“ఈ చుట్ట ఎలా కాలుతోందో చూడు! పెదవుల మధ్య యిలా నొక్కిపట్టి గాలి పీల్చితే ఇలా చుట్ట చివర నిప్పురాజుకొని ఆ అగ్ని తాకిడికి పొగాకు కాలి ఇలా పొగ నోట్లోకి వస్తే ఇలా ఒదులుతారు” వివరించాడాయన తాపీగా.

“చుట్ట ఎలా కాలుస్తారో వివరించనక్కరలేదు, సార్! నాకూ తెలుసు. మీ చుట్టల్ని మీరే పీల్చేసి ఆనందించి, అనుభవించి అందుకు మమ్మల్ని పరిహారం అడుగుతున్నారే అదే నాకర్థంకానిది” సహనం కోల్పోయాడు నేనే.

“అర్థంకాకపోతే వెళ్ళి బీమా డాక్యుమెంట్ చదవుకో” విసురుగా అన్నాడు జంబుకేశ్వర్. “నీకొక్క పైసా కూడా ఇవ్వను”

అంతకంటే విసురుగా అన్నాడు నేనే.

★ ★ ★

సహజంగానే జంబుకేశ్వర్ కోర్టుకెక్కాడు. విచారణలో...

బీమా డాక్యుమెంట్‌లో "అగ్ని తాకిడివల్ల గాని, అగ్ని రాజుకోవడంవల్ల గాని చుట్ట కాలిపోతే" అన్న నియమం ఉంది.

"యువరానర్! నేను చుట్ట నోటిలో పెట్టుకొని, అగ్గిపుల్ల గీసి దాని మంటను చుట్టకు అంటించాను. ఆ అగ్ని తాకిడివల్ల నేను గాలి పీల్చినప్పుడు చుట్ట రాజుకుంది. అలా దఫదఫాలుగా వరుసగా అగ్ని రాజుకోవడంవల్ల చుట్ట పూర్తిగా కాలిపోయింది. ఇదే విధంగా వంద చుట్టలూ కాలిపోయాయి. బీమా డాక్యుమెంట్‌లోని నియమానికి అనుగుణంగానే చుట్టలు కాలిపోయాయి కనుక సదరు బీమా కంపెనీ నాకు బీమా సొమ్ము చెల్లించ వలసిందే" బల్లగుద్ది మరీ వాదించాడు జంబుకేశ్వర్.

డాక్యుమెంట్‌లోని ప్రతి అక్షరం, వాక్యం, వ్యాఖ్యానం మీద హోరా హోరీగా ఘోరంగా వాదోపవాదాలు సాగాక-

"అగ్ని తాకిడి ప్రమాదవశాత్తు జరగవచ్చు. ఉద్దేశ పూర్వకంగానూ జరగవచ్చు. ఉద్దేశ పూర్వకంగా అగ్నితాకిడి కలిగిస్తే బీమా సొమ్ము ఇవ్వబడదని స్పష్టంగా డాక్యుమెంట్‌లో పేర్కొనలేదు. ఆ స్పష్టత లేనందువల్ల జంబుకేశ్వర్ వాదనను సమ్మతిస్తూ ఆయనకు బీమా కంపెనీ లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశిస్తున్నాం" అని తీర్పు!

నేనే గూబగుయ్‌మంది. కళ్ళు బైర్లుకమ్మి మెదడు పేలిపోయింది. "అన్యాయం! ఘోరం!" లోలోనే అరుచుకున్నాడు నేనే.

★ ★ ★

సీతానగరంలో "న్యాయంకోసం, న్యాయంకోసం మాత్రమే" అనే బైలైన్‌తో "చైతన్య విక్రమం" అనే సంస్థ ఉంది. దానిలో చైతన్య ప్రఖ్యాత లాయర్ అయితే విక్రమ్ విఖ్యాత డిటెక్టివ్.

వాళ్ళని సంప్రదించమని అన్నగారిచ్చిన సలహా పట్టుకొని "చైతన్య విక్రమం"కి వెళ్ళి వాళ్ళ ఎదుట కుర్చీలో కూలబడ్డాడు నేనే. కాసేపు సేదదీరాక నోరు విప్పాడు.

"ఆంగ్లేయులు చట్టాన్ని గాడిదతో పోల్చుతారు. కోర్టుకెక్కిన వాడూ గాడిదను ఎక్కినవాడూ ఒకటే అని మన వాళ్ళూ అంటూ ఉంటారు. న్యాయంకోసం కోర్టుకుపోతే గాడిద తన్నింది సార్" బావురుమన్నాడు.

చైతన్య, విక్రమ్ చిన్నగా నవ్వుకున్నారు.



"డాక్యుమెంట్‌లోని లోపం వల్లనే మీకు నష్టం వచ్చింది. అందుకు చట్టాన్ని నిందించడం తగదు. ఆ చట్టంవల్లనే మీకు లాభం కలగబోతున్నది. నిజం చెప్పాలంటే చట్టం గాడిద లాంటిది కాదు, గుర్రం లాంటిది! రౌతు మెత్తన అయితే ఆ గుర్రమే గాడిద వేషాలేస్తుంది! అంతే."

"మా కంపెనీ న్యాయ వ్యవహారాలన్నీ వంకాయల అండ్ సొరకాయల అనే సంస్థ చూస్తుంది సార్."

"అదేం పేరు!" ఆశ్చర్యపోయారు చైతన్య, విక్రమ్.

"వంకాయల లక్ష్మణమూర్తి, సొరకాయల సోమనాథం అనే లాయర్లు స్థాపించిన సంస్థ అది. ఈ దెబ్బతో వంకాయలన్నా, సొరకాయలన్నా విరక్తి కలిగింది సార్." ఏడవలేక నవ్వుతూ బీమా డాక్యుమెంట్ చైతన్యకిచ్చాడు నేనే.

దాన్ని క్షుణ్ణంగా చదివిన చైతన్య ముఖం గంభీరంగా మారి కనుబొమలు ముడిపడ్డాయి. "ఈ డాక్యుమెంట్‌ని తయారుచేసినందుకు వాళ్ళకి ఫీజు చెల్లించారు కదా. ఆ రశీదు ఉందా?"

జేబులోంచి రశీదు తీసి యిస్తూ "ఫీజుతోబాటు సర్వీస్ టాక్స్ కూడా గుంజారు సార్ ఆ మహానుభావులు!" మళ్ళీ బావురుమన్నాడు నేనే.

"అదే మంచిదైంది! ఆ పాయింట్‌తోనే మనం వంకాయనీ, సొరకాయనీ కోసెయ్యవచ్చు. డాక్యుమెంట్ తయారుచేసినవాడు మీ కంపెనీ ఉద్యోగి అయినా వంకాయ సొరకాయలు సర్వీస్‌టాక్స్ వసూలు చేయకపోయినా పరిస్థితి మనకు అనుకూలంగా ఉండేది కాదు."

నేనేకి ఏమీ అర్థం కాలేదు.

"వాళ్ళు తయారుచేసిన డాక్యుమెంట్‌లోని పొరపాటు వల్లనే మీకు నష్టం వచ్చింది. ఇది ఖచ్చితంగా సేవా లోపం కిందకు వస్తుంది. వాళ్ళు టాక్స్ వసూలుచేసి కూడా ఉత్తమ సేవ అందించలేదు కాబట్టి, మీరు నష్టపరిహారం రాబట్టవచ్చు!"

చైతన్య చెప్పగానే నేనే ముఖం వెలిగిపోయింది.

"అంతే కాదు. మీరు జంబుకేశ్వర్ మీద కూడా కేసు పెట్టవచ్చు. గెలవ వచ్చు!"

"అదెలా సార్!!" నిండా ఆశ్చర్యంలో మునిగిపోయాడు నేనే.


"బీమా చేసిన వస్తువుల్ని ఉద్దేశ పూర్వకంగా ధ్వంసం చేస్తే అది నేరమే అవుతుంది. జంబుకేశ్వర్ ఉద్దేశ పూర్వకంగా చుట్ట వెలిగించి దఫదఫాలుగా కొన్ని వందలసార్లు అగ్నిని రాజేసి చుట్టలన్నింటినీ కాల్చేసి ధ్వంసం చేశాడు కాబట్టి మీరు కేసు పెట్టవచ్చు."

ఎగిరి గంతేశాడు నేనే. "మీరు చేపట్టిన ఏ కేసులోనూ ఓడిపోలేదని మా అన్నయ్య చెప్పాడు సార్! ఈ కేసు కూడా మీరే వాదించాలి" సంబరంగా అన్నాడు.

"డాక్యుమెంట్‌లోని లోపం వల్లనే మీకు నష్టం వచ్చింది. అందుకు చట్టాన్ని నిందించడం తగదు. ఆ చట్టంవల్లనే మీకు లాభం కలగబోతున్నది. నిజం చెప్పాలంటే చట్టం గాడిద లాంటిది కాదు, గుర్రం లాంటిది! రౌతు మెత్తన అయితే ఆ గుర్రమే గాడిద వేషాలేస్తుంది! అంతే." నవ్వేశాడు చైతన్య.

తర్వాత-

నేనే వంకాయల అండ్ సొరకాయల, జంబుకేశ్వర్‌ల మీద కేసులు పెట్టి గెలిచాడని వేరే చెప్పాలా? ★



## 'డెత్ ఆఫ్ గాడ్'

శిల్పి ఉలి మెదిలితే భావాలు శిల్పాలు అవుతాయి. కోటి అర్థాలనిస్తాయి. భావ గాఢత అన్నది శిల్ప సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తుంది. ఇక్కడ కనిపిస్తున్న రెండు శిల్పాలూ ఇందుకు దర్పణాలే. పేగులు చీల్చుకుని ఓ మేక నిలబడినట్టున్న శిల్పం మూగ జీవాలపై నాగరిక మనిషి ఆటవికతకు సంకేతమే. దాని ఆవేదనకూ దర్పణమే. మెదడులోకి బాకు చొచ్చుకుపోయినట్టు కనిపిస్తున్న మరో శిల్పం కూడా కోటి భావాలను పలికించే అద్భుతమే! బ్రిటీష్ శిల్పి డామిన్ హ్రిస్ట్ కళారూపాలైన ఈ రెంటినీ మెక్సికోలోని హిలారియో ఎగ్జిబిషన్‌లో ఇటీవల జరిగిన 'డెత్ ఆఫ్ గాడ్' ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

